సాక్షి చిత్తూరు

మంగళవారం । 19 । నవంబర్ । 2024



ఎడాపెడా తోడేయ్!

కౌండిన్య నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పచ్చనేతల కనుసన్నల్లో ఇసుక తరలిపోతోంది. - 8లో



దయచూపని సర్కారు

తమ సమస్యల పరిష్కారంలో కూటమి సర్కారు దయచూపలేదని 108, ఆశా కార్యకర్తలు వాపోయారు. - 8లో



గ్రామ కంఠం అమ్మేశారు!

కుప్పం మండలం బొగ్గుపల్లెలో గ్రామ కంఠం భూమిని అమ్మేశారు. ఈ తతంగాన్ని టీడీపీ నేతలు ముందుండి నడిపించారు - 8లో

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌కు 37 ఫిర్యాదులు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమానికి 39 ఫిర్యాదులు అందాయి. సోమవారం ఎస్పీ మణికంఠ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వీటిని ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేయాలన్నారు. అలాగే చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్ రాజు సైతం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

టీడీపీ నేతల కనుసన్నల్లో బెల్టు షాపుల వేలం



సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు

సాక్షిటాస్క్‌ఫోర్స్ : ప్రభుత్వం మద్యం షాపుల ద్వారా బెల్టుషాపుల ఏర్పాట్లకు టీడీపీ నాయకులు శ్రీకారం చుట్టారు. దీనిపై టీడీపీకి చెందిన రెండు వర్గాలు వేర్వేరుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాయి. చౌడేపల్లె మండల టీడీపీ నాయకుడు గ్రామాల్లో బెల్టు షాపుల ఏర్పాటుకు రూ.2 లక్షల వరకు వసూలు చేసి, వేలం వేసినట్లు అదే పార్టీకి చెందిన ఒక వర్గం నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, వాటిని చౌడేపల్లె కోసం అనే సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. చౌడేపల్లె మండలంలోని యల్లంపల్లి, ఆమినిగుంట, చౌడేపల్లె, గడ్డంవారిపల్లె, బోయకొండ, బత్తలాపురం, సింగిరిగుంట, పరికిదొన, చుక్కావారిపల్లె గ్రామాల్లో బెల్టుషాపులు ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు. ఈ షాపుల ద్వారా 24 గంటలు మద్యం అందుబాటులో ఉండేలా హుకుం జారీ చేసినట్లు సమాచారం. ఈ విషయాల ద్వారా పల్లెల ప్రశాంతత దెబ్బతింటోందని, ఈ విషయాలను ఎక్సైజ్ వారికి తెలిసిన మొద్దు నిద్రలో నటిస్తున్నారని పేర్కొన్నారు.

అధికారం అడ్డుపెట్టుకుని.. నిబంధనలకు నిలువునా పాతరేసి.. ఇష్టారాజ్యంగా గ్రానైట్ కొల్లగొడుతున్నారు. అనుమతులు లేకుండానే తవ్వకాలు సాగిస్తూ దోచేస్తున్నారు. అక్రమాలను అరికట్టాల్సిన గనుల శాఖాధికారులు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా కొండలు కరిగిపోతున్నాయి. రూ.కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది.



అధికారం అడ్డుపెట్టు.. కసితీరా కొల్లగొట్టు



కనతల చెరువు ప్రాంతంలో జరుగుతున్న అక్రమ క్వారీ



సాక్షి టాస్క్‌ఫోర్స్: బంగారుపాళెంలో క్వారీలను కొల్లగొట్టేస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అందిన కాడికి దోచేస్తున్నారు. రూ.కోట్ల విలువైన గ్రానైట్‌ను కాజేస్తున్నారు. ఈ అక్రమాలు టీడీపీ నేతల కనుసన్నల్లో జోరుగా సాగుతున్నాయి. అక్రమంగా తవ్వి తీసిన గ్రానైట్ దిమ్మెలను తమిళనాడుకు అడ్డదారిలో తరలించి రూ.కోట్లకు పడగెత్తుతున్నారు. అక్రమార్కుల కోరల్లో చిక్కుకున్న క్వారీలను విడిపించడంలో అధికారులు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు భగ్గుమంటున్నాయి. గనుల శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. మెటల్, గ్రావెల్, గ్రానైట్ క్వారీల నిబంధనలను టీడీపీ నేతలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. అక్రమంగా తవ్వకాలు చేపట్టి.. రాత్రికి రాత్రే తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక వ్యాపారం ఓ వైపు నడుస్తుండగా..మరో వైపు గ్రానైట్ అక్రమాలు పుంజుకుంటున్నాయి.

పదుల సంఖ్యలో క్వారీలు

బంగారుపాళ్యం మండలంలో పదుల సంఖ్యలో క్వారీలున్నాయి. ఇందులో చాలా వాటిని అనుమతులు తీసుకోకుండా అక్రమంగా గ్రానైట్ తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రధానంగా మండలంలోని ఎగువ కనతల చెరువు ప్రాంతంలో అక్రమ తవ్వకాలు జోరందుకుంటున్నాయి. ఇక్కడ సర్వే నంబర్ 56లో నాలుగు క్వారీలున్నాయి. ఇందులో ఒక క్వారీకి అనుమతులుండగా..మిగిలిన మూడింటికి ఎలాంటి అనుమతులు లేవని స్థానికులు భగ్గుమంటున్నారు. ఓ గ్రానైట్ క్వారీకి సంబంధించిన రెన్యూవల్ ప్రక్రియ ఆగిపోయింది. ఇదే అదునుగా భావించి టీడీపీ నేతలు రెచ్చిపోయారు. అధికార బలం ఉపయోగించి క్వారీలను వారి వశం చేసుకున్నారు. నిత్యం రూ.లక్షల విలువ చేసే గ్రానైట్ దిమ్మెలను హద్దులు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు.

వదిలేస్తారా..?

అనుమతి లేదని తెలుసుకున్న ఆ అధికారులు అధికార పార్టీకి తలొగ్గాల్సి వస్తోంది. బంగారుపాళెం మండలానికి చెందిన ఓ బడా నాయకుడు. చిత్తూరుకు చెందిన నాయకులు కలసి ఈ దందా చేస్తున్నారని తెలుసుకోవడంతో గనులశాఖ అధికారులకు దిక్కుతోచడం లేదు. వదిలేయాలని పైస్థాయి నుంచి ఒత్తిడి ఉంది. అయితే దీనిపై చర్యలు తీసుకుంటారా?..లేదా వదిలి పెడతారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తప్పుడు రిపోర్ట్ పెట్టి విచారణను సర్దుబాటు చేసేలా అధికారులకు డైరెక్షన్ వెళుతోంది. ఇంతకీ పట్టుబడ్డ అక్రమ మైనింగ్‌పై ఏం తేలుస్తారో వేచి చూడాల్సి ఉంది.

కొరవడిన గనుల శాఖ పర్యవేక్షణ

క్వారీలపై గనులశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో క్వారీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. లీజు తీసుకున్న ప్రాంతంలో కాకుండా మరో ప్రాంతంలో తవ్వకాలు చేస్తూ విలువైన ఖనిజాన్ని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దొరికితే దొంగ.. లేదంటే దొర అన్న చందంగా వ్యవహారం సాగుతోంది.

పూజలు చేసి మరీ అక్రమ తవ్వకాలు ప్రారంభం

ఎగువ కనతల చెరువు ప్రాంతంలోని ఆ అక్రమ క్వారీలు యాదమరి మండలం, తమిళనాడులోని పరదారామి సరిహద్దు ప్రాంతంలో ఉన్నాయి. దీంతో పాటు ఈ ప్రాంతంలో లభిస్తున్న గ్రానైట్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అందులోను అక్రమ రవాణాకు మార్గం సులువు కావడంతో ఇక్కడ టీడీపీ నేతలు అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్నారు. అక్రమ తవ్వకాలకు మూడు నెలలకు ముందు పూజలు చేసి, మరీ ప్రారంభించారు. యంత్రాలను రంగంలోకి దింపారు. కొండను కరిగించే పనిలో పడ్డారు. అలా కొండను కరిస్తూ..విలువైన గ్రానైట్‌ను దోచుకుంటున్నారు. ఈ క్వారీ తమిళనాడుకు సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో గ్రానైట్ బండలను టీడీపీ నేతల సొంత వాహనాల్లో తమిళనాడుకు తరలిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా ఈ దందా కొనసాగిస్తున్నారు. రాత్రి పూట మరింత రెచ్చిపోతున్నారు. ఇప్పటికే రూ.కోట్ల విలువ చేసే గ్రానైట్ స్వాహా చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇలానే కొనసాగితే కొండ కరిగి పోయి, మైదానంగా మారుతుందని వారు వాపోతున్నారు.

సాక్షి టాస్క్‌ఫోర్స్

ప్రభుత్వ ఆదాయానికి గండి



దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే సామెతను టీడీపీ నేతలు తూచ తప్పకుండా పాటిస్తున్నారు. క్వారీల్లో చాలా వాటికి శాఖ అనుమతులు తీసుకోకుండా తవ్వకాలు చేస్తున్నారని అదే ప్రాంతానికి చెందిన కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కొండెక్కిన అధికారులు అక్రమ గ్రానైట్‌ను పట్టుకున్నారు. అక్కడి వాహనాలు, గ్రానైట్ దిమ్మెలను లెక్కకట్టారు. ఇంతకీ ఎవరెవరి ఆధ్వర్యంలో ఈ అక్రమ క్వారీలు నడుస్తున్నాయని అధికారులు ఆరా తీశారు. అప్పటికప్పుడే అక్రమ క్వారీ పనులను ఆపాలని అధికారులు కేకలు పెట్టారు. అయినా పట్టించుకోకుండా అక్రమార్కులు యథావిధిగా అక్రమ తవ్వకాలను కొనసాగిస్తున్నారు. కొందరు ముడుపులు ముట్టజెప్పి గ్రానైట్ అక్రమ రవాణాను నిరాటంకంగా సాగిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.

> **అక్రమ తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు**
>
> క్వారీ లీజు అనుమతులు లేకుండా తవ్వకాలు చేసి ఖనిజాన్ని తరలిస్తే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో పర్యటించి లీజు ప్రాంతాల్లో కాకుండా మరో ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తున్న వారికి నోటీసులిచ్చి, భారీగా జరిమానాలు విధించి, లీజు రద్దు చేస్తాం. ప్రభుత్వ అనుమతులు తీసుకున్న లీజు ప్రాంతాల్లోనే తవ్వకాలు చేపట్టి పర్మిట్లు తీసుకున్న తర్వాతే ఖనిజాన్ని తరలించాలి.
>
> – గంజి వెంకటేశ్వర్లు, డిప్యూటీ డైరెక్టర్, గనులశాఖ

తప్పా..? ఒప్పా..!

- కార్డన్ సెర్చ్ కొన్ని ప్రాంతాలకే పరిమితమా..?
- తరచూ దళితవాడలు.. స్లమ్స్‌లోనే ఖాకీల తనిఖీలు
- మిగిలినచోట్ల అసాంఘిక శక్తులు లేవా..? నేరాలు జరగవా.!
- ఆత్మాభిమానం.. గౌరవ మర్యాదలు కొందరికేనా..?
- పోలీసులకు ఆత్మ పరిశీలన అవసరం

అన్నీ వారికే చెల్లు



" ఇటీవల ఉదయం 5.20 గంటల సమయంలో నిద్రపోతున్న ప్రజలను లేపి వాహనాలకు సంబంధించిన రికార్డులు తీసుకురమ్మని ఆదేశించారు. ఇది చిత్తూరు నగరంలోని ఇరువారం వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీ."



" ఉదయం 5.30 గంటలకు నిద్రిస్తున్న కుటుంబాన్ని నిద్రలేపి, ఇంట్లోకి వెళ్లి పోలీసులు తనిఖీలు చేశారు. చిత్తూరులోని సంతపేట దుర్గకాలనీలో నిర్వహించిన కార్డన్‌సెర్చ్ ఇది."

చిత్తూరు అర్బన్: అసాంఘిక శక్తులు చట్టం నుంచి తప్పించుకోకూడదన్నదన్నదే కార్డన్‌సెర్చ్ ప్రధాన లక్ష్యం. ఏదైనా ప్ర దేశంలో అసాంఘిక శక్తులు దాగి ఉన్నట్లు తెలిసినా, గంజాయి, సారా విక్రయాలు, ఆయుధాల కలిగి ఉండడం, చోరీ చేసిన వాహనాలు ఓ చోట దాచి ఉండడం లాంటి సమాచారం పోలీసులకు అందితే.. నిందితులు తప్పించుకోకుండా ఆ ప్రాంతాన్ని జల్లెడపట్టి చర్యలు తీసుకుంటారు. సంఘ విద్రోహ శక్తులు ఎవరైనా దొరికితే వారిని అరెస్టు చేయడం, పోగొట్టుకున్న వాహనాలను స్వాధీనం చేసుకోవ డం చేస్తారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. అసలు కార్డన్ సెర్చ్‌కు పోలీసులు ఎంపిక చేసుకుంటున్న కాలనీలు, ప్రాంతాలు విమర్శలకు దారితీస్తోంది. చాలా చోట్ల ఎస్సీలు, గిరిజనులు, ఎస్టీ జనాభా అ త్యధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో మాత్రమే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తర చూ కొన్ని ప్రాంతాల్లోనే ఇలాంటి తనిఖీలు చే యడంతో గౌరవ మర్యాదలు తమకులేవా..? అనే ప్రశ్నలు అక్కడి ప్రజల్లో తలెత్తుతోంది. ఇతర సంపన్న కాలనీల్లో కార్డన్‌సెర్చ్‌లు ఎందుకు చేయడం లేదని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్ణీత వార్డుల ప్రకారం ప్రతీ కాలనీలో ఇలాంటి తనిఖీలు నిర్వహించాలని, ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో కార్డన్‌సెర్చ్ చేయడంతో సమాజంలో తాము వివక్షకు గురవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్యం బాగున్నా...!

అసాంఘిక శక్తులు, సంఘ విద్రోహ శక్తులు చట్టం నుంచి తప్పించుకోకూడదనే పోలీసుల లక్ష్యం బాగానే ఉన్నా.. ఓ పాత సామెతను గుర్తించుకోవాల్సిన అవసరం ఉంది. వంద మంది నేరస్తులు చట్టం నుంచి తప్పించుకున్నా.. ఒక్క నిర్దోషికి మాత్రం శిక్ష పడకూడదనే సూక్తిని పోలీసులు గుర్తించాలి. కార్డన్ సెర్చ్ చేయడం నేరం..? మీకు ఈ అధికారం ఎవరు ఇచ్చారు..? అని ఎవరూ ప్రశ్నించడంలేదు. కానీ ఇదే మానవ హక్కులు కూడా ముఖ్యమే. ఓ ఇంట్లోకి వెళ్లి నిద్రపోతున్న కుటుంబాన్ని లేపి తనిఖీలు చేసిన తరువాత ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగలేదని తెలిస్తే, అక్కడ ఏవీ దొరక్కుంటే ఒకరి గౌరవ హక్కులను కాలరాయడమే కదా..! అలాగని సంపన్న శ్రేణులు ఉంటున్న చోట్ల అసాంఘిక కార్యకలాపాలు జరగవు.. అని నిర్ధారించి సర్టిఫికెట్ ఇచ్చే అధికారం కూడా పోలీసులకు లేదు. సమాజంలో గౌరవ మర్యాదలతో జీవించే హక్కు రాజ్యాంగం అందరికీ సమానంగానే కల్పించింది. ఇక చట్టం అందరికీ ఒకేలాగే వర్తింపచేయాలి. దీన్ని పోలీసుశాఖ ఆత్మవిమర్శ చేకోవాల్సిన అవసరం ఉంది.

ఎన్నో ప్రశ్నలు..



చిత్తూరులోని భరత్‌నగర్ కాలనీలో కార్డన్‌సెర్చ్ చేస్తున్న పోలీసులు(ఫైల్)

'కార్డన్‌సెర్చ్...' ఇటీవల పోలీసులు తరచూ ఉపయోగిస్తున్న పదం. ఓ 30 మంది పోలీసులతో కాలనీల్లోకి తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో వెళ్లడం. నిద్రపోతున్న వారి ఇంటి గేటు కొట్టి నిద్రలేపడం.. బయటి ఉన్న స్కూటర్ రికార్డులు చూపమని అడగటం.. ఇంట్లో గంజాయి, సారా, ఆయుధాల్లాంటివి ఏమైనా ఉన్నాయోమోనని తనిఖీలు చేయడం .. ఇంత వరకు బాగానే ఉంది. కానీ పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించడానికి వెళుతున్న కాలనీలు, ప్రాంతాల్లో అత్యధిక శాతం ఎస్సీలు, ఎస్టీలు నివసిస్తున్నవి కావడం విమర్శలకు దారిస్తోంది. చిత్తూరు నగరంలో ఇటీవల కార్డన్‌సెర్చ్ నిర్వహించిన ప్రాంతాలు పరిశీలిస్తే ఇరువారం దళితవాడ, సంతపేట ఓబనపల్లె కాలనీ, భరత్‌నగర్ కాలనీ, వెంగళరావు కాలనీ, శ్రీనివాసనగర్ కాలనీ, నీవానది కాలనీ ఇలా చాలా ప్రాంతాలు మురికివాడలు, దళితులు ఎక్కువగా నివసిస్తున్న కాలనీలే కావడం గమనార్హం. అసలు కార్డన్‌సెర్చ్ లక్ష్యం ఏమిటి..? పోలీసులు ఏం చేస్తున్నారు..? దీంతో సామాన్యులకు కలుగుతున్న ఇబ్బందులు ఏమిటి.? ఒక్క వర్గం ప్రజలు ఉంటున్న కాలనీల్లోనే కార్డన్‌సెర్చ్‌లు నిర్వహించాలా..? నేరస్తులు కొన్ని కాలనీలకే పరిమితమా..? ఇలాంటి ప్రశ్నలు ఎన్నో సామాన్యుడి మదిని తొలిచేస్తున్నాయి.

> **నిబంధనల మేరకే..**
>
> కార్డన్‌సెర్చ్, సామూహిక తనిఖీలు అనేవి మాకొచ్చే సమాచారం ఆధారంగా చేపడతాం. అలాగే ఒక్కోసారి నేరాలు నమోదవుతున్న ప్రాంతాల ఆధారంగా కూడా జరుగుతుంది. మాకు ఎవరిపైనా వివక్ష లేదు. నిబంధనల మేరకు తనిఖీలు అనేవి జరుగుతాయి. అన్ని ప్రాంతాల్లో కూడా చేయాలనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.
>
> – టి.సాయినాథ్, డీఎస్పీ, చిత్తూరు.

> **పద్ధతి మార్చుకోవాలి**
>
> కార్డన్‌సెర్చ్ అనేది కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితం చేయడంతో ఓ సామాజిక వర్గం ప్రజలను చిన్నచూపు చూసినట్టే అవుతుంది. దొంగతనాలు చేసేవాళ్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవాళ్లు, సంఘ విద్రోహశక్తులు పలానా చోట ఉన్నట్లు సమాజానికి తప్పుడు సంకేతాలు వెళతాయి. ఇది మంచి పద్ధతికాదు. అలాంటి భావన రాకుండా పోలీసులు వ్యవహరించాలి.
>
> – నాగరాజన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, దళిత హక్కుల పోరాట సమితి

తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు



చిత్తూరు కలెక్టరేట్ : అధికారులు తీరు మార్చుకోకపోతే చర్యలు కఠినంగా ఉంటాయని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పాడి పశువుల సంక్షేమానికి చేపట్టిన గోకులం షెడ్ల నిర్మాణంలో అలసత్వం ఎందుకని మండిపడ్డారు. పురోగతి ఎందుకు తక్కువగా ఉందో చెప్పాలని పశుసంవర్ధకశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని హెచ్చరించారు. కొన్ని మండలాలలో మార్కింగ్ చేసి పనులు ప్రారంభించక పోవడం ఏమిటని ప్రశ్నించారు. మార్కింగ్ చేసిన చోట పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. 4 స్టేజీల్లో బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. గోకులం షెడ్ల నిర్మాణంలో ఏపీడీలు ఏపీఓలు మార్కింగ్ చేసిన వెంటనే పనులు ప్రారంభించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, డ్వామా పిడి రవికుమార్, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్, జిల్లా సిరికల్చర్ అధికారి శోభారాణి పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం

పూతలపట్టు: దివగంత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డిని విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన పూతలపట్టు మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. పూతలపట్టు మండలంలోని మూర్తిగానూరులో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం గ్రామస్తులు ఘటన స్థలానికి వెళ్లి చూడగా విగ్రహం తల, మిగిలిన భాగం వేర్వేరు చోట్ల పడి ఉండడాన్ని గమనించి, వైఎస్సార్‌సీపీ నాయకులకు తెలియజేశారు. అనంతరం వీఆర్వో ఫిర్యాదు మేరకు ఎస్ఐ కృష్ణ మోహన్ కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై వైఎస్సార్ సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునిల్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి నీచమైన చర్యలకు పాల్పడుతున్న వారిపై పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని, నిందితులను శిక్షించాలని కోరారు. పార్టీ నాయకులు శైలజా చరణ్ మాట్లాడుతూ నిందితులను వేగవంతంగా గుర్తించి, వారిని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నాలుగు నెలల క్రితం కూడా..

సార్వత్రిక ఎన్నికల ఫలితాల రోజు పూతలపట్టు మండలంలోని ఎగువపాలకూరులో టీడీపీకి చెందిన కార్యకర్తలు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఆ ఘటన జరిగిన నెల తరువాత అదే విగ్రహానికి ఉన్న శిలాఫలకాన్ని సైతం ధ్వంసం చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

ఎడాపెడా తోడేయ్!

అక్రమమా..సక్రమమా..తర్వాత సంగతి.. గాలి ఉన్నప్పుడే తూర్పార పట్టాలన్న చందంగా మారింది పచ్చ ఇసుకింకరుల పరిస్థితి. వాహనానికి టీడీపీ స్టిక్కర్.. భుజంపై పచ్చ కండువా వేసుకుని రైతుల పట్టా భూముల్లో సైతం ఇసుక తవ్వి కర్ణాటకకు తరలిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే మా ప్రభుత్వం.. మా ఇష్టం అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు.

పట్టా భూములపై పచ్చ పడగ

- లోకేష్‌కు ఫిర్యాదు చేస్తామంటున్న రైతులు
- కౌండిన్య నది నుంచి కర్ణాటకకు యథేచ్ఛగా తరలుతున్న ఇసుక
- ఓ జేసీబీ, రెండు ట్రాక్టర్లను సీజ్

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెద్దపంజాణి మండలంలోని కౌండిన్య నదిలో ఇసుక తవ్వకాలు జోరందుకున్నాయి. నదిలో ఇసుక తగ్గడంతో అక్రమార్కులు రైతుల పట్టా భూముల్లోనూ ఇసుకను అక్రమంగా తవ్వి ట్రాక్టర్లలో పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఇదేమని? అక్కడి రైతులు ప్రశ్నిస్తే ఇది తమ ప్రభుత్వమని, ట్రాక్టర్లకు టీడీపీ స్టిక్కర్లను అంటించుకుని మెడలో పసుపు కండువా వేసుకుని ఈ అక్రమాలకు పాల్పడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపంజాణి మండలంలోని చామనేరు వద్ద కౌండిన్య నదిలో నిత్యం జేసీబీలు, ట్రాక్టర్లతో వందలాది లోడ్ల ఇసుకను స్మగర్లు తోడేస్తున్నారు.



పెద్దపంజాణి పోలీసులు సీజ్ చేసిన జేసీబీ



కౌండిన్య నదిలో ఇసుక తవ్వకాలు పడిన గుంతలు

పోలీసులకు ఫిర్యాదు

కౌండిన్య నదిలోని ఇసుకతోపాటు రైతుల పట్టాభూముల్లోని ఇసుకను అక్రమార్కులు తోడేస్తున్నారు. దీంతోపాటు నదిలోని చెక్‌డ్యామ్‌లు, రైతుల పొలాల్లోని భారీ వృక్షాలు సైతం నేలకూలుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతానికి చెందిన పలువురు టీడీపీకి చెందిన రైతులే ఇసుకాసురుల దందాను అడ్డుకున్నారు. ట్రాక్టర్లు జేసీబీలను అక్కడినుంచి వెళ్లిపోవాలని హెచ్చరించారు. పార్టీకి చెడ్డపేరు తెస్తున్న మీలాంటి వారి కారణంగా పార్టీకి భవిష్యత్తు ఉండదని దీనిపై తాము మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. నదిలో సాగుతున్న ఇసుక దందాను తమ సెల్‌ఫోన్లలో వీడియో తీసి దీనిపై పెద్దపంజాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసుల నదిలో ఇసుకను తోడుతున్న రెండు ట్రాక్టర్లు, ఓ జేసీబీని సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం వీటిని అక్కడి తహసీల్దార్‌కు అప్పగించారు.

పచ్చకండువా వేస్కో..ట్రాక్టర్‌కు స్టిక్కర్‌పెట్టుకో..

పెద్దపంజాణి మండలానికి చెందిన టీడీపీ కార్యకర్తలో లేక నాయకులో కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన వారు, అసలు పార్టీకి సంబంధం లేని వారు సైతం ట్రాక్టర్లకు టీడీపీ స్టిక్కర్లను అంటించుకుని, భుజంపై పచ్చకండువా కప్పుకుని కౌండిన్య నదిలో యథేచ్ఛగా ఇసుకను తోడి పది కిలోమీటర్ల దూరంలోని కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఈ విషయం ఆ మండల టీడీపీ నేతలకు సైతం తెలియకుండానే సాగుతోందా? అనే అనుమానాలు వస్తున్నాయి. ఏదేమైనా గత నాలుగైదు నెలలుగా కౌండిన్యలో సాగుతున్న ఇసుక అక్రమ రవాణాతో భవిష్యత్తులో ఈ ప్రాంతం ఏడారిగా మారడం ఖాయమనే మాట ఆ మండల రైతుల్లో వినిపిస్తోంది. దీనిపై స్థానిక ఎమ్మెల్యే సైతం అధికారుల ద్వారా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పెరుపాదం గేట్లు తెరిచిన అయ్యప్ప భక్తుడు

- శబరిమలైలో జీడిమాకులపల్లె వాసికి దక్కిన అదృష్టం



పోలీసు బందోబస్తు నడుమ పెరుపాదం గేట్లు తెరిచిన అయ్యప్ప భక్తుడు తేజేష్ కుమార్

గంగవరం: నవంబర్ నెల కార్తీక మాసంలో కేరళ రాష్ట్రంలోని పెరుపాదం గేట్లు తెరిచే అదృష్టం మండలంలోని జీడిమాకులపల్లెకు చెందిన అయ్యప్ప భక్తుడు తేజేష్‌కుమార్‌కు దక్కింది. 48 రోజుల కఠోర అయ్యప్పమాల దీక్ష చేస్తున్న ఇతడు ఇరుముడి చెల్లించి దీక్ష విరమించేందుకు శబరిమలైకు వెళ్లారు. అక్కడ పోలీసు బందోబస్తు నడుమ అతని చేతుల మీదుగా మొట్టమొదటి సారి పెరుపాదం గేట్లను తెరిపించారు. అంతటి భాగ్యం లభించినందుకు ఆలయ నిర్వాహకులకు, పోలీసులకు అతను కృతజ్ఞతలు తెలిపాడు. తమ గ్రామ అయ్యప్ప భక్తుని చేతుల మీదుగా పెరుపాదం గేట్లు తెరవడం గర్వకారణమని అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బాధ్యతగా విధి నిర్వహణ

చిత్తూరు అర్బన్: పోలీసులు వారికి కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఏఎస్పీ రాజశేఖరరాజు అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు వారికి కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తగా నిర్వర్తించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. కానిస్టేబుల్, సిబ్బందిలు ఎదుర్కొనే సమస్యలను తన దృష్టికి తీసుకోరావచ్చన్నారు. ఈ సమావేశంలో పోలీస్ కార్యాలయ ఏఓ నాగభూషణమ్మ, ఏఏఓ దస్తగిరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులో బంగారు గొలుసు చోరీ

చౌడేపల్లె: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వృద్ధురాలి హ్యాండ్ బ్యాగ్‌లో బంగారు చైను చోరీ జరిగిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం మేరకు వివరాలిలా.. పుంగనూరు పట్టణానికి చెందిన విశ్రాంత సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సరస్వతి సోమవారం ఆర్టీసీ బస్సులో సదుంకు బయలుదేరారు. హ్యాండ్‌బ్యాగ్‌లో 24 గ్రాముల బరువు గల బంగారు చైను పెట్టుకున్నారు. అయితే చౌడేపల్లెకు రాగానే హ్యాండ్‌బ్యాగ్ జిప్ తెరుచుకుని ఉండడంతో చూడగా చైన్ చోరీ అయిందని గుర్తించారు. పక్క సీటులో కూర్చున్న మహిళ సైతం అక్కడ నుంచి ఉడాయించగా ఈమె చౌడేపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్ఐ ఫక్రుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

దయ చూపని సర్కారు

- కలెక్టరేట్ వద్ద 108 అసోసియేషన్ నేతల ఒక రోజు రిలే దీక్ష
- డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా చేసిన ఆశా వర్కర్లు



చిత్తూరు కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి సర్కారు తమ డిమాండ్లను పరిశీలించి దయ చూపడం లేదని 108, ఆశా వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట 108 అసోసియేషన్ ఒక రోజు రిలే నిరాహార దీక్ష, ఆశా వర్కర్లు ధర్నా చేశారు. ఈ మేరకు 108 ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని కొన్ని రోజులుగా నిరసనలు తెలిపి, అధికారులకు వినతులు ఇస్తున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఈ నెల 18 తేదీన కలెక్టరేట్ వద్ద ఒక రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికీ కూటమి ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 25వ తేదీన తేదీన సమ్మెకు వెళతామని హెచ్చరించారు. సమ్మెకు వెళితే ప్రజలకు కలిగే పూర్తి అసౌకర్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఈ రిలే నిరాహార దీక్ష లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 108 ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆశా కార్మికుల గోడు పట్టదా?

జిల్లాలోని ఆశా కార్మికుల గోడు కూటమి సర్కారుకు పట్టదా? అని సీఐటీయూ ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి డిమాండ్ చేశారు. సోమవారం ఆశా వర్కర్లు చిత్తూరు కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి సర్కారు ఎన్నికలకు ముందు ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. ఆశాల లక్ష్యం నెరవేరకుండా అదనపు పనులు చేయించడం అన్యాయమని దుయ్యబట్టారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు అనురాధ, సుబ్బలక్ష్మి, వనజాక్షి, సావిత్రి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి దయలేదా....



తమ సమస్యలను పరిష్కరించాలని కూటమి సర్కారుకు దయ లేదా? అని ప్రశ్నిస్తున్నాం. డిమాండ్లను పరిష్కరించాలని గొంతు చించుకుని ఆవేదన వ్యక్తం చేస్తున్నా కూటమి సర్కారుకు చీమ కుట్టినట్టు కూడా లేదు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాకా ఆ హామీలన్నీ ఎందుకు అమలు చేయడం లేదు. వెంటనే ఆశా వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలి.

– కృష్ణవేణి, ఆశా వర్కర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

ఎందుకు పట్టించుకోవడం లేదు



కూటమి సర్కారు ఓట్ల కోసం ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లకు బూటకపు హామీలిచ్చింది. తీరా గద్దెనెక్కాక వారి గోడును పట్టించుకోవడం లేదు. సీఎం చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో వ్యవహరించి, ఆశా వర్కర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుంది.

– వాడ గంగరాజు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు.

న్యాయం చేసే వరకు పోరాటం



108 ఉద్యోగులకు న్యాయం చేసే వరకు తమ పోరాటాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఆపేదే లేదు. ప్రజా సేవ చేస్తున్న తమ పై కూటమి ప్రభుత్వం చిన్న చూపు చూడడం అన్యాయం. 108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతున్నప్పటికీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రైవేట్ కంపెనీలకు నిర్వహణ బాధ్యతలు ఎందుకు ఇస్తున్నారో తెలియాలి. 108 ఉద్యోగులకు 3 షిఫ్టులలో 8 గంటల పనివిధానం అమలు చేయాలి.

– నవీన్, 108 ఉద్యోగి, చిత్తూరు

ఉద్యోగ భద్రత కల్పించాలి



108 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. ఎన్నో సంవత్సరాలుగా ఇదే ఉద్యోగంలో పనిచేస్తున్నాము. మా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పరిష్కరించకపోవడం అన్యాయం. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి న్యాయం చేయాలి. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా మాకు అన్ని సౌకర్యాలు కల్పించాలి. మా సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతాం.

– గీత, 108 ఉద్యోగి ఐరాల. చిత్తూరు జిల్లా.

గ్రామ కంతం అమ్మేశారు!

- ప్లాట్లుగా మార్చి రూ.లక్షలకు విక్రయం
- ముందుండి నడిపించిన టీడీపీ నాయకులు

కుప్పంరూరల్: ఎక్కడైన ఒక సెంటు భూమి ఆక్రమణకు గురైన, పక్కదారి పట్టిన రెవెన్యూ అధికారులకు ఇట్టే చట్టాలు గుర్తుకు వస్తాయి. ఏకంగా గ్రామానికి ఆనుకుని ఉన్న విలువైన భూమిని ప్లాట్లుగా మార్చి అమ్ముకున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తతంగం మొత్తం టీడీపీ నాయకులు ముందుండి నడిపించడం గమనార్హం. కుప్పం మండలం, దాసేగౌనూరు పంచాయతీ బొగ్గుపల్లిలో సర్వే నంబర్ 8/2లో 31 సెంట్ల గ్రామం కంతం ఉంది. దీనిపై టీడీపీ నాయకుల కన్నుపడింది. గత ప్రభుత్వ హయాం నుంచి స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించినా అప్పట్లో వీలు కాలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాగానే దేవాలయ నిర్మాణం పేరిట 31 సెంట్ల భూమిపై నాయకుల కన్నుపడింది. ఆలోచనే తడవుగా 4 రోజులుగా 31 సెంట్ల స్థలానికి చదును చేశారు. ఆదివారం చదును చేసిన భూమిని 6 సైట్లుగా విభజించి వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో ఒక్కో ప్లాటు రూ.4లక్షల నుంచి రూ.5 లక్షల విలువ పలికినట్లు గ్రామస్తులు చెప్పారు. ఆలయ నిర్మాణ చందాల ద్వారా చేపడ తామని కొంత మంది గ్రామస్తులు వారిస్తున్నా, వి నకుండా సైట్లుగా మార్చి విక్రయించారు. ఏదైనా గ్రామ అవసరాలకు ఉపయోగపడే విలువైన గ్రామ కంతం భూమిని పరుల పాలు చేయడంపై ఆ గ్రామస్తులు కొంతమంది బహిరంగంగా విమర్శలకు దిగుతున్నారు.



గ్రామ కంతం స్థలంలో వేసిన ప్లాట్లు

కడా పీడీకి ఫిర్యాదు

కుప్పం మండలం బొగ్గుపల్లిలో 31సెంట్ల గ్రామకంతం భూముల అమ్మకంపై గ్రామస్తులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన విచారణకు ఆదేశించారు. దీనిపై కుప్పం తహసీల్దార్ చిట్టిబాబును వివరణ కోరగా, గ్రామ కంతం పంచాయతీ పరిధిలోకి వస్తుందని, పంచాయతీ నిర్ణయంతో ఏదైనా అవసరాలకు వాడుకోవచ్చని వివరణ ఇచ్చారు.

ఉపాధి నిధులు గోల్‌మాల్..?

సాక్షి టాస్క్‌ఫోర్స్: సదుం మండలంలో గృహ నిర్మాణ పథకంలో ఉపాధి నిధులు గోల్‌మాల్ చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో పక్కా ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్క ఇంటికి రూ.23 వేలు మేరకు ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించి, బిల్లులు చెల్లిస్తారు. బిల్లుల చెల్లింపులకు ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఉపాధి జాబ్‌కార్డు కలిగి ఉండాలి. అలాకాకుంటే లబ్ధిదారులు వేరే వ్యక్తుల జాబ్‌కార్డుకు బిల్లులు మంజూరు చేయా లని వినతిపత్రం అందజేయాల్సి ఉంటుంది. కానీ సుమారు 25 గృహాలకు ఇలాంటి వినతిపత్రాలు లేకనే ఉపాధి, హౌసింగ్ సిబ్బంది కొందరు కూటమి నాయకుల సహకారంతో లబ్ధిదారులకు తెలియకుండానే బిల్లులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమా రు రూ.5 లక్షలకు పైగా స్వాహా చేసినట్లు సమాచారం. దీనిపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపితే, మరింత మంది లబ్ధిదారుల వివరాలు బయటపడే అవకాశం ఉంది.

మా సమస్యలు పరిష్కరించండి

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- వినతులు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ
- నమోదైన 190 అర్జీలు

చిత్తూరు కలెక్టరేట్ : అయ్యా...మా సమస్యలు పరిష్కరించండి.. అంటూ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు వినతులు అందజేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 190 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, డీఆర్ఓ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.



అర్జీదారుని సమస్యను వింటున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

దారి సమస్య పరిష్కరించాలి



దారి సమస్య పరిష్కరించాలని కోరుతున్న నాలుగు గ్రామాల వాసులు

దారి సమస్య పరిష్కరించాలని పలమనేరు నియోజకవర్గం కొలమాసనపల్లి పంచాయతీలో నాలుగు గ్రామాలవాసులు వాపోయారు. ఈ మేరకు వారు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు రమణయ్య, వెంకటేశులు మాట్లాడుతూ పలమనేరు మండలం ఎరుగుండపల్లి, పాలుమాకులపల్లి, దిగువఊరు, దిగువకల్లు గ్రామాల్లో 50 ఎకరాల భూమి ఉందన్నారు. ఆ భూముల్లోకి వెళ్లాలంటే దారి లేదని చెప్పారు.

స్పీడు బ్రేకర్లు వేయించాలి

చిత్తూరు మెసానికల్ మైదానం నుంచి ఫారెస్టు మీదుగా కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో స్పీడు బ్రేకర్లు వేయించాలని బీజేపీ నాయకులు రామభద్ర, కరుణాకర్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మెసానికల్ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. భారీ వాహనాలు, ఇసుక ట్రాక్టర్లు వేగంతో వెళ్లడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు చెప్పారు. స్పీడు బ్రేకర్లు వేయించాలని కోరారు.



కలెక్టరేట్‌లో బీజేపీ నేతలు

ఏడీ రావడం లేదు :



అంధ విద్యార్థులు

జిల్లా విభిన్నప్రతిభావంతులశాఖ ఏడీ శ్రీనివాస్ తిరుపతిలో అంధుల వసతి గృహం వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆ హాస్టల్‌లోని అంధ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు తిరుపతి నుంచి చిత్తూరుకు విచ్చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తిరుపతి ప్రభుత్వ అంధుల శరణాలయ విద్యార్థులు మాట్లాడుతూ తిరుపతిలోని ప్రభుత్వ అంధుల శరణాలయంలో 50 మంది విద్యార్థులున్నారన్నారు. హెడ్‌కుక్, వాచ్‌మెన్ ఉద్యోగ విరమణ పొంది దశాబ్దం అవుతోందన్నారు. అప్పటి నుంచి ఆ పోస్టులు భర్తీ చేయకుండా ఔట్ సోర్సింగ్ సిబ్బందితో నిర్వహిస్తున్నారని చెప్పారు. ఏడీ తమ సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలి



పట్టాలు మంజూరు చేయాలని కోరుతున్న గిరిజనులు

చాలా సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని సోమల, చౌడేపల్లి, పెద్దపంజాణి మండలాలకు చెందిన గిరిజన రైతులు కృష్ణయ్య, మునిరత్నం కోరారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 35 ఏళ్లుగా తాము వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నట్లు తెలిపారు. 2005 అటవీ హక్కుల చట్టం ప్రకారం తాము సాగుచేసుకుంటున్న వ్యవసాయ భూములకు పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు సుబ్బరాజు, రాజమ్మ, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేరు మోసిన సారా వ్యాపారి అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పేరుమోసిన సారా వ్యాపారి చిన్నయ్య అలియాస్ విజయరాజును ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నగరంలోని మూడో గేటు సమీపంలో సారా విక్రయిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పవన్‌కు సమాచారం అందింది. దీనిపై స్పందించిన ఆయన వన్‌టౌన్ పోలీసులు, తన సిబ్బందితో కలిసి భరత్‌నగర్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. చిన్నయ్య అనే వ్యక్తి 150 సారా ప్యాకెట్లు లభించడంతో అతన్ని అరెస్టు చేశారు. కాగా చిన్నయ్యపై సారా కేసులు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. గత 40 రోజుల్లో రెండుమార్లు ఇతన్ని పోలీసులు అరెస్టు చేయడం గమనార్హం. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సుబ్రమణ్యం, సిబ్బంది దేవప్రసాద్, రాజేష్, ఢిల్లీ బాబు, తంబీష్, కృష్ణవేణి, దీప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి



మనోహర్‌నాయుడు(ఫైల్)

పూతలపట్టు: రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ కృష్ణమోహన్ కథనం మేరకు.. పూతలపట్టు మండలం అయ్యప్పగారిపల్లె పంచాయతీ కొండకిందపల్లెకు చెందిన మనోహర్ నాయుడు(57), సోమవారం వ్యక్తిగత పనుల నిమిత్తం తన స్కూటర్‌లో ఇంటి నుంచి పాకాలకు బయలుదేరాడు. మార్గం మధ్యలో అయ్యప్పగారిపల్లె వద్ద ఎదురుగా అధిక వేగంతో వస్తున్న ఆటో, స్కూటర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో మనోహర్ నాయుడు అక్కడిక్కడే మృతి చెందారు. అయ్యప్పగారిపల్లెకు చెందిన నిందితుడు ఆటోడ్రైవర్ చౌదరిపై సీఐ కేసు నమోదు చేశారు.